క్లుప్తంగా

తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చు


రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

గుర్రంపోడు : భూ భారతి చట్టం అమలులో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తు ఇవ్వలేని వారు ఈ నెల 20వ తేదీలోపు తహసీల్దార్ కార్యాలయాల్లో ఇవ్వొచ్చని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. గురువారం మండలంలోని పోచంపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సులో ఆమె రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డారు. రెవెన్యూ సదస్సులతో రైతుల భూ సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పి. శ్రీనివాస్, ఆర్‌ఐ నజీర్, పీఏసీఎస్ చైర్మన్ చనమళ్ల యాధవరెడ్డి, నాయకులు తగుళ్ల సర్వయ్య, నిమ్మల అంజిరెడ్డి, గుత్తా తిరుమల్‌రెడ్డి, సోమరాములు, మేడి వెంకన్న, సామల బొజ్జయ్య, బొంగురాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

కొండమల్లేపల్లి : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కోఆర్డినేటర్ ఎస్.జాన్‌నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 12నుంచి జూలై 11వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. అపరాధ రుసుముతో ఆగస్టు 12వ తేదీ వరకు చెల్లించువచ్చునని పేర్కొన్నారు.

పెంచిన బస్‌పాసు చార్జీలను తగ్గించాలని వినతి

మిర్యాలగూడ టౌన్ : పెంచిన బస్సు పాసు చార్జీలను తక్షణమే తగ్గించాలని కోరుతూ గురువారం ప్రొగ్రెసివ్ స్టూడెంట్స్ యూనియన్ (పీఎస్‌యూ) ఆధ్వర్యంలో మిర్యాలగూడ ఆర్టీసీ డీపో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ జిల్లా కన్వీనర్ వంశీ, కో కన్వీనర్ అజయ్‌లు మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల నుంచి విద్య కోసం పట్టణాలకు వచ్చే విద్యార్థులకు బస్‌పాసులు పెంచడం వలన అనేక ఇబ్బందులు పడుతారన్నారు. బస్‌పాసుల చార్జీలను రూట్లను బట్టి 20శాతం వరకు చార్జీలు పెంచడం జరిగిందన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఆ యూనియన్ నాయకులు రవి, శంకర్, అరుణ్, మహేందర్‌రెడ్డి ఉన్నారు.

గిరిజనులకు పట్టాలు అందించాలి

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలో 20ఏళ్ల తరబడి ప్రభుత్వ భూములను సేద్యం చేసుకుంటూ కబ్జాలో ఉన్న గిరిజన రైతులకు ప్రభుత్వం పట్టా పాస్‌పుస్తకాలు అందించాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లావుడియా ఎర్రనాయక్ అన్నారు. గురువారం దామరచర్ల మండలంలోని కల్లేపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన అధికారులకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ధీరావత్ లక్ష్మణ్‌నాయక్, కిషన్‌నాయక్, రామునాయక్, చీనా, పచ్చ్యానాయక్, హనుమంతు, మేఘ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

సామెతలలో హితబోధ శతకం పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న లక్ష్మీనరసింహామూర్తి, తదితరులు

మిర్యాలగూడ : పట్టణంలోని విద్యానగర్ కాలనీలో వరసిద్ధి వినాయక దేవాలయంలో భాషా ప్రవీణ వారణాసి ఆంజనేయులు రచించిన సామెతలలో హితబోధ శతకం పుస్తకాన్ని బుధవారం అష్టవధాని కాటేపల్లి లక్ష్మీనరసింహామూర్తి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామెతలలో పద్యాల నేది ఎవరూ చేపట్టని కొత్త ప్రక్రియ అని, తేలికైన పదాలతో 102 సామెతలలో చక్కటి పద్యాలను ఆటవెలదిలో రచయిత రాసినట్లు తెలిపారు. మృగశిర కార్తె పూర్ణిమలో ఏరువాక సాగుతున్నట్లుగా సామెతలలో హితబోధ శతకం అజరామర కీర్తిని పొందినట్లు ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తడకమళ్ల రామచంద్రరావు, తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య వ్యవస్థాపకులు పులి కృష్ణమూర్తిశర్మ, వారణాసి కోటేశ్వర్‌రావు, శ్రీధరశర్మ, నందికొండ చంద్రయ్య, లక్ష్మీనారాయణశర్మ, లక్ష్మీనర్సయ్య, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

పెంచిన వేతన బకాయిలు చెల్లించడంపై హర్షం

మిర్యాలగూడ అర్బన్ : మున్సిపల్ కార్మికులకు పెంచిన వేతనాలను చెల్లించడంపై సీఐటీయూ హర్షం వ్యక్తం చేసింది. గురువారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డబ్బికార్ మల్లేశ్ మాట్లాడారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లు గౌతమ్‌రెడ్డి, తిరుపతి రాంమ్మూర్తి, తెలుగుకుంట్ల పాపిరెడ్డి, రామచంద్ర, వెంకన్న తదితరులున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

- డీఈఓ బొల్లారం బిక్షపతి


హాలియా : విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేస్తున్న డీఈఓ బొల్లారం బిక్షపతి


పెద్దవూర : ఎస్టీ హాస్టల్‌లో విద్యార్థులకు స్వాగతం పలుకుతున్న ఏటీడీఓ, ఉపాధ్యాయులు


అడవిదేవులపల్లి : విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న డీఎస్‌ఓ వెంకటేశం

హాలియా : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని డీఈఓ బొల్లారం బిక్షపతి అన్నారు. పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో గురువారం హాలియా ఉన్నత పాఠశాలల్లో పేరెంట్స్, టీచర్స్ మీటింగ్స్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు. పాఠశాల విద్యార్థులతో కలిసి డీఈఓ మధ్యాహ్న భోజనం చేశారు. ఈసందర్భంగా హాలియా, కొత్తపల్లి పాఠశాలలను డీఈఓ సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ గుండా కృష్ణమూర్తి, కమిషనర్ రామదుర్గారెడ్డి, కేజీబీవీ పాఠశాల స్పెషల్ ఆఫీసర్ హైమావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

నిడమనూరు : ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని మండల ప్రత్యేకాధికారి కృష్ణవేణి, మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం అన్నారు. గురువారం మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆర్చీ ని ప్రారంభించి మాట్లాడారు. పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీను కుమార్ దాతల సాయంతో, పాఠశాల పూర్వ విద్యార్థుల నుంచి విరాళాలు సేకరించి పాఠశాల ఆర్చీ, తరగతి గదులకు రంగులు, బోర్డులు, గోడలపై జాతీ నేతల చిత్ర పటాలు, వివిధ రకాల పక్షులు, జంతువుల చిత్రలతో పాఠశాల రంగులమయంగా రూపొందించారు. ఇటీవల చెరుపల్లి వెంకటేశం, భారతమ్మల జ్ఞాపకార్థం వారి కూతురు దివ్య ఆర్థిక సహకారంతో పాఠశాల ఆర్చీ నిర్మించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశం, ఎంఈఓ ఎల్ వెంకన్న, ప్రధానోపాధ్యాయులు చంద్రకళ, ఉపాధ్యాయుడు కే శ్రీను కుమార్, కాంప్లెక్స్ హెచ్ ఎం గౌతం, ఉపాధ్యాయులు టీ ఝాన్సీ, పి. పూర్ణిమా, స్వాతి, స్థానికులు ఆంజనేయులు, బాబురావు, పలువురు స్థానికులు పాల్గొన్నారు.

ప్రతి చిన్నారి అంగన్‌వాడీకి రావాలి

ప్రతి చిన్నారి అంగన్‌వాడీకి వచ్చేలా కృషిచేయాలని జిల్లా సంక్షేమాధికారి కృష్ణవేణి సూచించారు. మండలంలోని రాజన్నగూడెం గ్రామంలో 'అమ్మమాట-అంగన్‌వాడీ బాట' ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో ఉదయశ్రీ, ఏసీడీపీఓ సువర్ణ, సూపర్‌వైజర్ సైదాబేగం, పంచాయతీ కార్యదర్శి వెంకన్న, ప్రాథమిక పాఠశాల హెచ్ ఎం రమాదేవి, అంగన్ వాడీ టీచర్లు సునీతా, రాజశ్వేరీ,ఝాన్సీలక్ష్మి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పెద్దవూర : విద్యార్థుల సంఖ్యను పెంచి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని హౌజింగ్ పీడీ, మండల ప్రత్యేక అధికారి ఎస్‌పీ రాజ్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాంలు, నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. పాఠశాల పునఃప్రారంభం సందర్భంగా కేక్ కట్ చేసి ఉపాధ్యాయులు, విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. పదవ తరగతిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించటం పట్ల ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి తరి రాములు, ఉపాధ్యాయులు రమాదేవి, కృష్ణయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పునఃప్రారంభమైన పాఠశాలలు

పెద్దవూర : మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు 2025–26 విద్యా సంవత్సరంలో గురువారం పునఃప్రారంభమయ్యాయి. ఆయా పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాల్లో మామిడి తోరణాలు, పూలదండలతో ప్రత్యేకంగా అలంకరించి విద్యార్థులకు స్వాగతం పలికారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా గ్రామాలలో ర్యాలీలు నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని ర్యాలీలు నిర్వహించారు.

ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలి

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : ప్రభుత్వ బడులను బలోపేతం చేసే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అడిషినల్ పీడీ, మండల ప్రత్యేక అధికారి శారద అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు యూనిఫాలను ఆమె ఎంఈఓ శ్రీనివాస్‌తో కలిసి పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మల్లీశ్వర్, ఎంఈఓ శ్రీనివాస్, శాగం పెద్దిరెడ్డి, నాగిరెడ్డి, సైదులు, బిక్షం తదితరులు పాల్గొన్నారు.

యూనిఫాం అందజేత

కొండమల్లేపల్లి : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పాఠశాల పునః ప్రారంభమైన సందర్భంగా విద్యార్థులకు ఎంఈవో నాగేశ్వర్‌రావు నాయక్ యూనిఫాంలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కట్టబోయిన శ్రీనివాస్, నజీరుద్దీన్, యాదగిరి, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

అడవిదేవులపల్లి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం డీఎస్‌ఓ వెంకటేశం స్కూల్ యూనిఫాంలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ రాగ్యానాయక్, ఇన్‌చార్జ్ ఎంఈఓ వరలక్ష్మి, ఎంపీడీఓ మాతంగి రమేష్, ఏపీఓ శేషయ్య, సీనియర్ ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రావులతో పాటు ఉపాధ్యాయులున్నారు.

చందంపేట : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మండల ప్రత్యేక అధికారి సామ్యూల్ జాకోబ్ ఆధ్వర్యంలో పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందజేశారు. అలాగే నేరెడుగొమ్ము జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీడీఓ లక్ష్మి పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలను అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చౌదరి, చంద్రశేఖర్, కొండయ్య, లోక్యనాయక్, పాల్గొన్నారు.

నాగార్జునసాగర్ : ప్రభుత్వ పాఠశాలల్లో క్వాలిఫైడ్ టీచర్లు ఉండి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తారని పెద్దవూర మండల అకాడమిక్ మానిటరింగ్ అధికారి శేషు తెలిపారు. గురువారం పాఠశాలలు ప్రారంభం కావడంతో పైలాన్ కాలనీలో ఆదర్శ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆపాఠశాల ఉపాధ్యాయులతో పాటు రిటైర్ హెచ్‌ఎం తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్


సూర్యతండాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ : అర్హులందరికీ ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతాయని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. గురువారం దేవరకొండ మండలం సూర్యతండాలో, దేవరకొండ పట్టణంలోని 10వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆయన శంఖుస్థాపన చేసి మాట్లాడారు.దేశంలో ఎక్కడా లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టిందన్నారు. అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. పేదవాడి సొంతింటి కళను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. అనంతరం తండాలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎంఏ సిరాజ్‌ఖాన్, ఆలంపల్లి నర్సింహ, నల్లగాసు జాన్‌యాదవ్, పల్లా నర్సింహారెడ్డి, శిరందాసు కృష్ణయ్య, కొర్ర రాంసింగ్, నారాయణనాయక్, శివయ్య, కొర్ర రవినాయక్, నర్యానాయక్, డీఈ నాగేందర్, ఎంపీడీఓ డానియల్, వడ్త్య దేవేందర్ ,పున్న వెంకటేష్,మాజీ కౌన్సిలర్లు, తదితర లున్నారు.

విద్యారంగానికి అధిక ప్రాధాన్యం

రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. గురువారం దేవరకొండ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న యూనిఫాం, పాఠ్య పుస్తకాలు అందజేసి ఆయన మాట్లాడారు. ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మాత్యనాయక్, నరసింహ, నర్సింహారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి


ఏరువాక పౌర్ణమి కార్యక్రమంలో భాగంగా దుక్కి దున్నుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : రైతులకు ఇబ్బందులు లేకుండా వారి సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం దామరచర్ల మండలంలోని వీర్లపాలెం గ్రామంలో ఏరువాక పౌర్ణమి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి పొలంలో దుక్కి దున్ని మాట్లాడారు. వ్యవసాయం, ప్రకృతి మధ్య సంబంధాన్ని ఏరువాక పౌర్ణమి గుర్తు చేస్తుందన్నారు. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఉచితంగా విద్యుత్, సాగునీరు, పెట్టుబడిసాయం, మద్దతు ధర అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు, మండల నాయకులు, రైతులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతానికి కృషి

మిర్యాలగూడ : ప్రభుత్వ విద్యా వ్యవస్థను నంబర్ వన్‌గా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో, దామరచర్ల మండలం వాడపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, దామరచర్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఆయన ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్‌తో కలిసి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాం అందించి మాట్లాడారు. ప్రభుత్వ విద్యాసంస్థల బలోపేతానికి కృషి చేస్తూ విద్యకు పెద్దపీట వేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలా కాకుండా పాఠశాల ప్రారంభం రోజునే విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫాంలను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెళ్లికి అడ్డుగా మారిన వరుస

- కూతురు వరుస కావడంతో పెళ్లికి అభ్యంతరం చెప్పిన యువతి
- వేరే సంబంధాలు చూస్తుండగా మనస్థాపంతో ఏఈఈ ఆత్మహత్య

బయ్యారం : ప్రేమికురాలితో కడదాకా జీవిద్దామనుకుంటే వరుస అడ్డురావడంతో జీవితంపై విరక్తి చెందిన ఓ ప్రేమికుడు బలవన్మరణం చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం కాపువారిగూడెం గ్రామానికి చెందిన పానుగోత్ దేవీలాల్(34) మహబూబాబాద్ జిల్లా గార్ల మండలంలో నీటిపారుదలశాఖ ఏఈగా విధులు నిర్వర్తిస్తున్నాడు. గత అక్టోబర్‌లో మొదటి పోస్టింగ్ పొందిన దేవీలాల్.. గార్లలో పనిచేస్తూ బయ్యారంలో అద్దెకుంటున్నాడు.

పెళ్లికి యువతి నిరాకరణ..

దేవీలాల్‌కు ఉద్యోగం రాకముందు పదేళ్లుగా తన తండాకు చెందిన ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. ఈ క్రమంలో ఆ యువతి వరుసకు కూతురు అవుతుండడంతో పెళ్లికి అభ్యంతరాలొచ్చాయి. దీంతో మనస్తాపం చెంది మొదటిసారి ఆత్మహత్యాయత్నం చేసుకోగా కాలు కోల్పోయాడు. ఆ తర్వాత ప్రభుత్వం ఉద్యోగం సాధించినా ఆ యువతిని మరువలేదు. ఈ క్రమంలో ప్రభుత్వ ఉద్యోగం రావడంతో దేవీలాల్‌కు పెళ్లి చేసేందుకు కుటుంబీకులు సంబంధాలు చూస్తున్నారు. అయితే తాను ప్రేమించిన యువతితో పెళ్లి అయ్యే పరిస్థితి లేకపోవడంతో కొన్ని రోజులుగా డిప్రెషన్‌లో ఉంటున్నాడు. ఈ క్రమంలో పురుగులమందు తాగే ముందు చివరి ప్రయత్నంగా బుధవారం ప్రేమికురాలితో ఫోన్‌లో మాట్లాడాడు. అయితే వరుస కుదరని ఆ యువతి తెలపడంతో పురుగుల మందు తాగాడు. అనంతరం ఈ విషయాన్ని తమ కార్యాలయంలో పనిచేసే అటెండర్ కుమారుడికి ఫోన్‌లో తెలిపాడు. వెంటనే దేవీలాల్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి తండ్రి మంగ్యా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తిరుపతి తెలిపారు.

వంద రోజుల ప్రణాళిక పకడ్బందీగా అమలు చేయాలి


సమావేశంలో పాల్గొన్న కమిషనర్, అధికారులు

మిర్యాలగూడ టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వంద రోజుల ప్రణాళికను అన్నీ వార్డుల్లో వార్డు ఆఫీసర్లు పకడ్బందీగా అమలు చేయాలని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ అన్నారు. గురువారం మున్సిపల్ కమిషనర్ చాంబర్స్‌లో వార్డు ఆఫీసర్లు, రెవెన్యూ, శానిటేషన్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మున్సిపల్‌లో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వంద రోజుల కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే 12 రోజుల వరకు పూర్తి అయిందన్నారు. ఈ సమావేశంలో ఆర్‌ఓ జ్ఞానేశ్వరీ, ఆర్‌ఐలు సాంబయ్య, సాజీ, శానిటరీ ఇన్స్‌పెక్టర్ వెంకటరమణ, టీపీఎస్ అంజయ్యలతో పాటు వార్డు ఆఫీసర్లు తదితరులున్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

- హాలియా పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు
- ఇంటింటికీ తిరిగి జాగ్రత్తలు చెబుతున్న వైద్యసిబ్బంది


ఇబ్రహీంపేటలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

హాలియా : వర్షాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముంది. ఏటా ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. వ్యాధుల నుంచి బయటపడేందుకు పడరానీపాట్లు పడుతున్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం కోసం వేలాది రూపాయలు ఖర్చు చేస్తు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఈ ఏడాది ముందస్తుగానే వర్షాలు కురుస్తుండడంతో వ్యాధుల ప్రభావం ఎక్కువగానే ఉండొచ్చనే ఉద్దేశంతో వైద్య, ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. ముందస్తుగా సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు.

వ్యాధుల నియంత్రణే లక్ష్యంగా..

రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు అనుముల మండలం హాలియా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ప్రజలను చైతన్య పరుస్తున్నారు. జూన్ 1నుంచి ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు, సూపర్‌వైజర్లు ఇతర వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ అప్రమత్తం చేస్తున్నారు. వ్యాధులు సోకకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు. ఇళ్లలోని నీటితొట్టిల్లో నిల్వ ఉన్న నీటిని పారబోస్తున్నారు. నిల్వ నీటిలో బ్యాక్టీరియా ఉత్తత్పి కావడంతో టైఫాయిడ్, మలేరియా తదితర వ్యాధులు వచ్చే అవకాశముందని సూచిస్తున్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, గ్రామాల్లో పారిశుద్య కార్యక్రమాలను చేపట్టడం ద్వారా రహదారులు, మురికికాలువలను పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ కార్యదర్శులకు సూచిస్తున్నారు. తాగునీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం, క్లోరినేషన్ చేయడం తదితర పనులు చేపట్టాలని కోరుతున్నారు. దోమల నియంత్రణకు ఫాగింగ్ చేయాలని, మురికి కాలువలు, నీటి నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్‌బాల్స్ చేయాలని కోరుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



వర్షాకాలం పురస్కరించుకుని గ్రామాల్లో పకడ్బందీగా వైద్యసిబ్బందితో చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. వ్యాధుల నియంత్రణకు ముందస్తుగా చర్యలు చేపట్టాం. పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం.

– డాక్టర్ రామకృష్ణ, హాలియా పీహెచ్‌సీ

ఆయిల్ పామ్ సాగుతో స్థిరమైన ఆదాయం


ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

గుర్రంపోడు : ఆయిల్ పామ్ సాగు ద్వారా రైతులు స్థిరమైన దిగుబడులు పొందవచ్చునని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి పి.అనంతరెడ్డి అన్నారు. గురువారం మండలకేంద్రంలోని చందా వెంకట్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమంలో మొక్కను నాటి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరే ఇతర పంటకు లేని విధంగా ఆయిల్ పామ్‌కు దిగుబడులను మార్కెట్‌తో సంబంధం లేకుండా కంపెనీల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయిస్తుందన్నారు. ఒక ఎకరం వరిసాగు నీటితో మూడెకరాల ఆయిల్‌పామ్ సాగు చేయవచ్చని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న డ్రిప్ సౌకర్యం, మొక్కలకు రాయితీ సౌకర్యాలను వినియోగించుకుని పెద్ద ఎత్తున ఆయిల్ పామ్ సాగుచేయాలని సూచించారు. ఈ పంటకు కోతుల బెడద, మార్కెటింగ్ సమస్య ఉండదని, సరాసరి దిగుబడి ఎకరాలకు పది టన్నుల వరకు వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అనుముల ప్రాంతీయ ఉద్యానవన శాఖాధికారి కె. మురళి, మండల వ్యవసాయాధికారి కె. మాధవరెడ్డి, పతంజలి కంపెనీ జిల్లా మేనేజర్ కె. మధుసూదన్ రెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ ప్రకాష్, మాజీ సర్పంచ్ షేక్ సయ్యద్‌మియా, ఉపసర్పంచ్ లాలయ్య, స్థానిక రైతు నాయకులు అమరేందర్ గౌడ్, యాదగిరిరెడ్డి, భద్రయ్య, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో విత్తనాలు

మాడుగులపల్లి : మండలంలోని రైతులకు అవసరమైన విత్తనాలు కుక్కడం గ్రామంలోని నాగార్జున సహకార సంఘం మార్కెటింగ్ సొసైటీలో అందుబాటులో ఉన్నాయని జిల్లా వయోవృద్ధుల, వికలాంగుల సంఘం జిల్లా కోఆర్డినేటర్ మునగాల నాగిరెడ్డి అన్నారు. నాగార్జున జిల్లా సహకార సంఘం ఆధ్వర్యంలో మండలంలోని కుక్కడం గ్రామంలో నాగార్జున సహకార సంఘం మార్కెటింగ్ సొసైటీను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సత్యనారాయణశర్మ, మాజీ సర్పంచ్ గోవిందరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ బట్టు మాధవరెడ్డి, మునగాల రామచంద్రారెడ్డి, రామస్వామి, పండగ నాగయ్య, బట్టు సైదిరెడ్డి, నకిరేకంటి శ్రీను, నూకపంగ నరహరి, పుట్టల వీరయ్య, రైతులు పాల్గొన్నారు.

7న ఎమ్మార్పీఎస్ జెండావిష్కరణ

గుర్రంపోడు : ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూలై 7న ప్రతి గ్రామంలో జెండావిష్కరణలు జరపాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్ మాదిగ, ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గాదె రమేష్ మాదిగ పిలుపు నిచ్చారు. గురువారం మండలంలోని తానేదార్‌పల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ సదస్సు మండల శాఖ అధ్యక్షుడు కొమిరె స్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం, ఉపాధ్యక్షుడు యాదయ్య, ఎంఎస్‌ఎఫ్ నాయకులు మాదిగ, మేడి సైదులు, నాయకులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు


పెద్దవూర : రికార్డులను పరిశీలిస్తున్న ఏటీడీఓ ఎం.శ్రీనివాసులు

పెద్దవూర : విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని జిల్లా సహాయ గిరిజన అభివృద్ధి అధికారి(ఏటీడీఓ) ఎం.శ్రీనివాసులు అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల, ఎస్టీ రెగ్యులర్ హాస్టల్, చలకుర్తి, స్పెషల్ హాస్టల్‌లను ఆయన డీటీడీఓ ఆదేశానుసారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, హాస్టల్ సిబ్బందికి సంబంధించిన హాజరు పట్టికలు, రికార్డులను, వంటగది, భోజనాలను, మూత్రశాలలు, వసతి గృహ పరిసరాలను పరిశీలించి మాట్లాడారు. ఆయన వెంట ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం డి.బాలోజీ, వార్డెన్‌లు కొల్లు బాలకృష్ణ, సుధాకర్, ఉపాధ్యాయులు కూస్‌రెడ్డి రాంరెడ్డి, ఎండీ.షబ్బీర్, బీ.కృష్ణ, సంధ్యా, సైదులు, షాహీన్‌బేగం, శాంతి, రామయ్య, శివలీల, ఏఎన్‌ఎం జ్యోతి, సిబ్బంది ఉన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి


శిరీషను అభినందిస్తున్న ఈటల రాజేందర్

నిడమనూరు : ప్రతి కార్యకర్త, బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని ఎంపీ ఈటల రాజేందర్ సూచించారు. నిడమనూరు బీజేపీ మండల అధ్యక్షురాలిగా ఎన్నికైన పెండోటి శిరీషను నల్లగొండ పార్టీ కార్యాలయంలో ఈటల అభినందించి, సత్కరించారు. బీజేపీలో మహిళలకు సముచిత స్థానం దక్కుతుందన్నారు. బీజేపీ హయాంలో జరుగుతున్న సంక్షేమాన్ని, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని బలోపేతం చేయాలని ఈటల సూచించినట్లు శిరీషా తెలిపారు. నూతన కార్యవర్గాన్ని, కార్యకర్తలను సాగర్ ఇన్‌చార్జి కంకణాల నివేదిత రెడ్డి ఎంపీ ఈటెల రాజేందర్‌కు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో నిడమనూరు నాయకులు ఉన్నం ఉషా కిరణ్, ఇరుగుల శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.

భూ సేకరణకు రైతులు సహకరించాలి


వర్కాలలో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ రమణారెడ్డి

చింతపల్లి : మండల పరిధిలోని వర్కాల గ్రామంలో సర్వేనంబర్ 173లో రైతులు భూసేకరణకు సహకరించాలని దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి కోరారు. గురువారం భూసేకరణ నోటిఫికేషన్లు పేర్లు వచ్చిన రైతులు భూమిని చదును చేస్తుడడంతో రెవెన్యూ అధికారులు సమాచారం మేరకు గ్రామానికి చేరుకొని గ్రామంలోని బాధిత రైతుల తో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం భూ అవసరాల నిమిత్తం భూమిని పునరావాసం నిర్మాణం కింద భూ సేకరణ చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలోని రైతులు భూమిని చదును చేయడం కారణంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని భూ సేకరణకు రైతులు సహకరించి ప్రభుత్వం అందిస్తున్న పరిహారాన్ని తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ భూమి స్వీకరణకు తాము సిద్ధంగా ఉన్నప్పటికీ తమకు భూమికి భూమితో పాటు సరైన పరిహారం అందించాలి అని డిమాండ్ చేశారు. మండల కేంద్రానికి భూమి సమీపంలో ఉండడంతో ప్రభుత్వ ఇస్తున్న పరిహారం చెల్లించాలని కోరారు. ఈ విషయమై కలెక్టర్‌తో మాట్లాడేందుకు కొంతమంది రైతులను నల్లగొండ కలెక్టర్ కార్యాలయానికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట తహసీల్దార్ రమాకాంత్ శర్మతోపాటు రెవెన్యూ అధికారులు ఉన్నారు.